సాక్షి
వికారాబాద్
మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



మారనున్న రూపురేఖలు

రానున్న రెండేళ్లలో తాండూరు మండల రూపురేఖలు మారుతాయని డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ అన్నారు. 8లో▸



బలమైన శక్తిగా బీజేపీ

రాష్ట్రంలో బీజేపీ బలమైన శక్తిగా ఎదుగుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. 8లో▸



పీడీలు లేక.. ఆటలు ఆడక!

ప్రభుత్వ పాఠశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లు లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తు గడువు పెంపు

అనంతగిరి: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకింగ్ పరీక్షల కోసం ఇస్తున్న ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు తేదీని ఈ నెల 27వరకు పొడగించినట్లు జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏఎంసీ పాలక మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, సభ్యులు

కొడంగల్: కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన పాలక మండలి చైర్మన్, వైస్ చైర్మన్ తోపాటు సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలోని కేఎస్‌వీ (మురహరి) ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రమాణం చేశారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన అంబయ్య గౌడ్, ఉపాధ్యక్షుడిగా దుద్యాల్‌కు చెందిన ఆకారం వేణుతో పాటు 13 మంది సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, యువజన కాంగ్రెస్ జాతీయ కో ఆర్డినేటర్ కృష్ణంరాజు, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పునే వాడాలి

డీఎంహెచ్ఓ పల్వన్‌కుమార్




ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్

అనంతగిరి: అయోడిన్ ఉప్పును మాత్రమే వాడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ ప్రజలకు సూచించారు. సోమవారం వికారాబాద్‌లోని డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆహార పదార్థాల్లో అధికంగా ఉప్పును వాడటం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. ప్రతిరోజూ ఐదు గ్రాముల లోపే ఉప్పు వాడాలన్నారు. నిత్యం వ్యాయామం చేయాలని, కొవ్వు తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి పీహెచ్‌సీ, సబ్ సెంటర్, కళాశాల, పాఠశాల, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలకు అయోడిన్ ఉప్పు ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జీవరాజు, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ నిరోష, అధికారులు శ్రీనివాసులు, రేణుకుమార్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

దొంగఎన్కేపల్లి పేరు మార్చండి

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శేరిరాంరెడ్డి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శేరిరాంరెడ్డి తదితరులు

దోమ: దొంగఎన్కేపల్లి గ్రామం పేరును సంజీవనగర్‌గా మార్చాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శేరిరాంరెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో వందల ఏళ్ల చరిత్ర గల శ్రీ సంజీవస్వామి దేవాలయం వెలసిందని, ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. స్వామి పేరును గ్రామానికి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆలయానికి పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా వందల ఎకరాల భూములు ఉన్నాయని, ఆ భూములు కబ్జాకు గురవుతున్నాయని, కాపాడాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శేరికృష్ణారెడ్డి, దమ్మి నర్సింహులు, కమ్మరి నాగేంద్రం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వుడాతో ఊపు



జిల్లా సమగ్రాభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవ

- వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పేరిట జీఓ విడుదల
- వుడా పరిధిలోకి నాలుగు మున్సిపాలిటీలు, 493 గ్రామాలు
- అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారీ

వికారాబాద్: త్వరలో జిల్లాకు మంచి రోజులు రానున్నాయి. సీఎం ప్రత్యేక చొరవతో జిల్లా అభివృద్ధికి వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పేరిట తొలి అడుగు పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఈ ప్రాంతం నుంచే ప్రాతినిథ్యం వహిస్తుండటంతో జిల్లా అభివృద్ధి పరుగులు పెట్టనుంది. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ అభివృద్ధికి కడా(కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేయడం భారీగా నిధులు మంజూరు చేయడంతో ఇతర నియోజకవర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. అభివృద్ధి మొత్తం కొడంగల్‌కే పరిమితం చేస్తారా..? అని ప్రతిపక్షాలు గళమెత్తాయి. ఎమ్మెల్యేపై కూడా ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక జీఓ 190 విడుదల చేసింది. వుడా(వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పేరుతో జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వుడా పేరుతో జీఓ విడుదల

వికారాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ నెల 15వ 190 జీఓను విడుదల చేసింది. వుడా పరిధిలోకి నాలుగు మున్సిపాలిటీలు(వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్)తోపాటు 493 రెవెన్యూ గ్రామాలు రానున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే పలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేసి ఆయా మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తోంది. జిల్లా హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతోపాటు వనరులు పుష్కలంగా ఉన్నాయి. వుడా చైర్మన్‌గా కలెక్టర్ ప్రతీక్‌జైన్ వ్యవహరించనున్నారు. వైస్ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్(లోకల్‌బాడీస్), ఐదుగురితో కమిటీ వేశారు. ఇందులో డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ కమిషనర్, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మిస్ట్రేషన్ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యంగా..

భవిష్యత్ అంచనాలు, ఆకాంక్షలకు తగ్గట్టుగా 20 నుంచి 30 సంవత్సరాల విజన్‌తో వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పేరుతో పనులు చేపట్టనున్నారు. ఇందుకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్లను రూపొందించనున్నారు. ప్రధానంగా జిల్లాలో రోడ్ల కనెక్టివిటీ, తాగునీటి సౌకర్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించడం లాంటివి చేపడతారు. ఇప్పటికే జిల్లా మీదుగా రీజనల్ రింగ్ రోడ్డు ప్రతిపాదన, నవాబుపేట మండలంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు స్థలం కేటాయింపు జరిగింది. మోమిన్‌పేట్ మండలంలో మొబిలిటీ వ్యాలీకి స్థలం ఎంపిక చేశారు. పూడూరు మండలం రాకంచర్లలో పారిశ్రామిక వాడను ప్రారంభించడం, వికారాబాద్ మొదలుకొని పరిగి, కొడంగల్ నియోజకవర్గాల మీదుగా రైల్వేలైన్ ప్రతిపాదన, అనంతగిరి పర్యాటక అభివృద్ధి వంటి ప్రాజెక్టులు ప్రారంభించేందుకు అంకురార్పణ జరిగింది. ఇటీవల నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. తాండూరు మున్సిపల్ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు ప్రారంభం కాగా వికారాబాద్ మున్సిపాలిటీలో రూ.800 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో పలు ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి రూ.191 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం వుడా ఏర్పాటుతో అభివృద్ధి వేగం పుంజుకునే అవకాశం ఉంది.

ప్రయోజనాలివే..

- జిల్లా పరిధిలోని నాలుగు మున్సిపాలిటీలు, నాలుగు నియోజకవర్గాలు, చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని నవాబుపేట మండలానికి చెందిన 493 రెవెన్యూ గ్రామాలు వుడా పరిధిలోకి రానున్నాయి.
- ప్రతిపాదిత ఏరియాలో సుదూర భవిషత్ లక్ష్యాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నారు.
- నాలుగు మున్సిపాలిటీలకు ఔటర్ రింగు రోడ్లు నిర్మిస్తారు.
- జిల్లాను హైదరాబాద్‌కు శాటిలైట్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేయనున్నారు.
- జిల్లాకు ప్రస్తుతం మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుండగా ప్రత్యామ్నాయ నీటి వనరులను అభివృద్ధి చేస్తారు.
- గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, అక్కడి నుంచి జిల్లా కేంద్రానికి రోడ్ల కనెక్టివిటీని మెరుగు పరుస్తారు.
- జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు.
- నాలుగు మున్సిపాలిటీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తారు.

సీఎంకు ధన్యవాదాలు



ఎంతో ముందుచూపుతో జిల్లాను వుడా పేరుతో అభివృద్ధి చేసేందుకు సంకల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా ప్రజల తరఫున ధన్యవాదాలు. గతంలో ఎప్పుడూ లేనంతగా, ఎవరూ చేయనంతగా జిల్లా అభివృద్ధిలో దూసుకుపోవటం ఖాయం. మున్సిపాలిటీలు, గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే వుడా ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీల్లో రవాణా సౌకర్యం మెరుగు పడుతుంది. – గడ్డం ప్రసాద్‌కుమార్, అసెంబ్లీ స్పీకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

‘స్వీప్’ను పక్కాగా నిర్వహించాలి

అనంతగిరి: జిల్లాలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమాలను (స్వీప్) ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి స్వీప్ కార్యక్రమాలు, గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు జాబితా రూపకల్పనపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ 2024–25 కోసం స్వీప్ కార్యక్రమాలను పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించాలన్నారు. యువ ఓటర్ల నమోదు తోపాటు దివ్యాంగులు, థర్డ్ జెండర్, సెక్స్ వర్కర్ మొదలగు వర్గాలు, ఆదివాసీ, గిరిజనుల ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఓటరు జాబితా రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అక్టోబరు 29న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. దీనిపై అభ్యంతరాలను, నూతన ఓటర్ల నమోదుకు దరఖాస్తులను నవంబరు 29వ తేదీ వరకు స్వీకరిస్తామని తెలిపారు. డిసెంబరు 26వ తేదీ నాటికి అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి పాల్గొన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి వాసుచంద్ర, ఉద్యాన వన శాఖ అధికారి సత్తార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నహమాత్ హలి పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యతను బట్టి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సుధీర్, లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్‌డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే సేఫ్టీ కిట్స్

- ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: గీత కార్మికుల రక్షణ కోసం కాటమయ్య రక్షణ కవచాలు ఎంతగానో ఉపయోగపడుతాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి సేఫ్టీ కిట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చాలా ఎత్తులో ఉండే తాటి చెట్లను ఎక్కే క్రమంలో గీత కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని, రక్షణ కిట్ల ద్వారా వీటికి చెక్ పెట్టే అవకాశం ఉందని తెలిపారు. ఒక్కో సేఫ్టీ కిట్ 1,500 కిలోల బరువును సైతం తట్టుకుంటుందన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి పాటుపడింది, వారిని కంటికి రెప్పలా కాపాడుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమేనని తెలిపారు. పాలనను గాలికి వదిలేసిన ప్రస్తుత ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే వరకూ తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు అందజేశారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి తదితరులు

వారి త్యాగాలు మరువలేనివి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- పోలీసు అమరవీరులకు ఘన నివాళి

అనంతగిరి: పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసులు అహర్నిశలు విధుల్లో ఉంటూ శాంతిభద్రతలను కాపాడతారని అన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలను ఈ సమాజం ఎన్నటికీ మరువదన్నారు. శాంతిభద్రతల నిర్వహణలో వారి సేవలు అమోఘమన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఎస్పీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలను లెక్కచేయకుండా శాంతిభద్రతలను కాపాడటం జరుగుతుందన్నారు. అనంతరం పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం పెట్టి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, అదనపు కలెక్టర్లు సుధీర్, లింగ్యానాయక్, ఏఎస్పీలు రవీందర్‌రెడ్డి, మురళీధర్, జిల్లాలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.


స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

అనంతగిరి: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్‌లోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం సకాలంలో స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. వెంటనే పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తును ఉద్యమిస్తామని హెచ్చరించారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు విద్యార్థి నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

శుభ గడియలు



- ముగిసిన మూఢాలు
- వివాహాది శుభకార్యాలకు లైన్ క్లియర్
- ఖరారవుతున్న వివాహ తేదీలు
- ఫంక్షన్ హాళ్లు, వస్త్రాభరణాలకు భలే డిమాండ్

షాబాద్: మూడు నెలలపాటు కొనసాగిన మూఢాలు ముగిసి, శుభకార్యాలకు ముహూర్తాలు మొదలయ్యాయి. ఇకనుంచి సుమారు మూడు నెలల పాటు నిరంతరాయంగా పెళ్లి భాజాలు మోగుతాయని, శుభకార్యాలు కొనసాగుతాయని పురోహితులు, పంచాంగకర్తలు, పూజారులు, వేద పండితులు చెబుతున్నారు. వివాహ సంబంధాలు కుదుర్చుకునే క్రతువులు, పెళ్లిచూపులు, సంబంధ ఒప్పందాలు, మాటాముచ్చట్లకు ఇది మంచి సమయమని పేర్కొంటున్నారు. దసరాతో మొదలైన శుభ గడియలు డిసెంబర్ 26 వరకు ఉన్నాయి. ఈ కాలంలో దాదాపు 32 రోజులకుపైగా సుముహూర్తాలు ఉండటంతో డప్పువాయిద్యాలు, మండపాలు, కేటరింగ్ నిర్వాహకులకు ఆర్డర్లు మొదలయ్యాయి. దీపావళి వేడుకలతో పాటు శుభకార్యాలకు అనువైన నెల కావడంతో మార్కెట్‌లో సందడి మొదలైంది. వస్త్ర, బంగారం దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. బంగానే ఆభరణాల కోసం ఆర్డర్లు వస్తున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ముహూర్తాలు ఇలా...

అక్టోబర్: 12, 13, 16, 20, 23, 24, 27, 28
నవంబర్: 3, 7, 8, 9, 10, 13, 14, 16, 17, 18, 23, 25
డిసెంబర్: 5, 6, 7, 8, 11, 12, 14, 15, 18, 20, 25, 26

షాపింగ్ మాల్స్ సందడి..

పెళ్లంటే ప్రత్యేకంగా కనిపించాలని వధూవరులతో పాటు కుటుంబీకులు, అతిథులు ఉబలాటపడుతుంటారు. షాపింగ్ మాల్స్, దుకాణాల్లో తమకు నచ్చిన దుస్తులు కొనుగోలు చేస్తుంటారు.ఈ క్రమంలో ఆయా షాపుల్లో సందడి మొదలైంది. దీనికి తోడు దీపావళి పర్వదినం నేపథ్యంలో విక్రయాలు జోరందుకున్నాయి.

ముస్తాబవుతున్న ఫంక్షన్ హాళ్లు

పెళ్లిళ్ల సీజన్ మొదలుతో ఫంక్షన్ హాళ్లు ముస్తాబవుతున్నాయి. చేవెళ్ల డివిజన్ పరిధిలో దాదాపు వందకు పైగా ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. వసతుల ఆధారంగా ఒక్క రోజు అద్దె రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ఉన్నాయి. సీజన్ కావడంతో ధరలు కొంత పెరిగినట్లు తెలుస్తోంది. బుకింగ్స్ కూడా జోరందుకున్నాయని ఓ ఫంక్షన్ హాల్ యజమాని తెలిపారు.

మంచి రోజులొచ్చాయి..



శుభముహూర్తాలు వచ్చేశాయి. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో రోజులు బాగున్నాయి. దీంతో వివాహాది శుభకార్యాలకు అడుగులు పడుతున్నాయి. మంచి రోజుల్లో శుభకార్యాలు చేసుకుంటే అంతా మంచి జరుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి.
– శ్రీను పంతులు, పురోహితుడు, షాబాద్

చదువుతోనే సమాజంలో మార్పు

- విద్యను అంగట్లో సరుకులా మార్చారు
- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్
- షాద్‌నగర్‌లో జూనియర్ కాలేజీ భవన నిర్మాణ పనులు ప్రారంభం

షాద్‌నగర్: విద్యకు తగిన ప్రాధాన్యం ఇస్తేనే సమాజంలో మార్పు వస్తుందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతో షాద్‌నగర్‌లో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి సోమవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.10 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోదంరామ్ మాట్లాడుతూ.. సమాజంలో గౌరవంగా బతకాలంటే చదువు తప్ప మరో మార్గం లేదన్నారు. సామాజిక స్పృహ, వ్యక్తిలో పరిణితి రావాలంటే విద్యతోనే సాధ్యమని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న చదువు ప్రస్తుతం అంగట్లో సరుకులా మారిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతీ విద్యార్థి జీవితంలో చదువు ఎంతో కీలకమైనదని తెలిపారు. ఇంటర్ విద్య జంక్షన్ బాక్స్ వంటిదని, ఈదశ నుంచి భవిష్యత్ కోసం ఎటువైపు అడుగులు వేయాలో నిర్ణయించుకుంటారని తెలిపారు. విప్లవకారుడు తుర్రెబాజ్‌ఖాన్ షాద్‌నగర్ ప్రాంతంలోనే తలదాచుకొని బ్రిటీష్ పాలనకులపై పోరాటం చేశారని గుర్తుచేశారు. పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే శంకర్ దాతల సహకారంతో కాలేజీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని కొనియాడారు.

తెలంగాణను నాశనం చేశారు

నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని గత పాలకులు నాశనం చేశారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా దాతలు, పూర్వపు విద్యార్థుల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. అనంతరం వ్యాపారవేత్తలు యుగేందర్‌రెడ్డి రూ.25 లక్షలు, సోమిరెడ్డి నరేందర్‌రెడ్డి రూ.6 లక్షలు, దండు వాసు రూ.5 లక్షలు, గోరీ బ్రదర్స్ రూ.1.08 లక్షల విరాళం ప్రకటించారు. కళాశాలలో ఆర్వో ప్లాంటు నిర్మాణానికి పలబట్ల పాండురంగం ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బక్కని నర్సింలు, భీష్వ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సారా విక్రయిస్తే కఠిన చర్యలు
తహసీల్దార్ కిషన్



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పెద్దేముల్: ప్రభుత్వ నిషేధించిన సారా విక్రయించినా.. సేవించినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ కిషన్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని దుగ్గాపూర్‌కు చెందిన పిర్యానాయక్, శాంతాబాయి దంపతులు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు ఎక్సైజ్ పోలీసులు భీమయ్య, రవిశంకర్ దాడి చేసి రెండు లీటర్ల సారా, బెల్లం పానకం సీజ్ చేశారు. అనంతరం వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

రిఫ్రిజిరేటర్ పేలి ఇల్లు దగ్ధం
రూ.1.50లక్షల నష్టం



కాలిబూడిదైన సామగ్రి

కుల్కచర్ల: రిఫ్రిజిరేటర్ పేలి ఇల్లు కాలిపోయిన ఘటన చాకల్‌పల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. చౌడాపూర్ మండలం చాకల్‌పల్లి గ్రామానికి చెందిన చెంచు చెన్నయ్య నెల రోజుల క్రితం ఓ ఫ్రిజ్ కొనుగోలు చేశాడు. సోమవారం ఫ్రిజ్‌లో సాంకేతిక సమస్యల కారణంగా అది పేలి ఇంట్లో మంటలు చెలరేగాయి. తాళం వేసిన ఇంటి నుంచి పొగలు రావడం గమనించిన ఇరుగుపొరుగు వారు తలుపులు పగులగొట్టి నీళ్లు చల్లి మంటలార్పారు. అప్పటికే ఇంట్లోని వస్తువులు, రూ.30వేల నగదు కాలిబూడిదయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటన చోటు చేసుకున్న సమయంలో ఇంట్లో వారు కూలీ పనులకు వెళ్లడం, పిల్లలు పాఠశాలకు వెళ్లడంతో పెనుప్రమాదం తప్పింది. సిలిండర్‌లోని గ్యాస్ అయిపోవడంతో ప్రమాదనష్టాన్ని తగ్గించింది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఇసుక తరలిస్తున్న ఆటో సీజ్

యాలాల: కాగ్నా నది నుంచి ఇసుకను సిమెంటు సంచుల్లో నింపి తరలిస్తున్న ఆటోను సోమవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ శంకర్ తెలిపిన ప్రకారం మండల పరిధిలోని కోకట్ కాగ్నా నది ప్రాంతంలో తనిఖీలు చేపట్టగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సిమెంట్ బస్తాల్లో ఇసుక నింపి తరలిస్తున్నట్లు గుర్తించి ఆటోను సీజ్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కారు, బైక్ ఢీ..

బొంరాస్‌పేట: వేగంగా ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనపై సోమవారం బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఎండీ రవూఫ్ తెలిపిన ప్రకారం.. ఈ నెల 18న మండల పరిధిలోని మద్దిమడుగుతండాకు చెందిన రాజు, విశాల్ బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో నమాజ్‌గుట్ట వద్ద ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. రాజు తల్లి హీరిబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం

మహదీషరీఫ్: ఆటోడ్రైవర్ అదృశ్యమైన సంఘటన మహదీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి గ్రామానికి చెందిన షేక్ అలీం కుమారుడు షేక్ మోసిన్(25) ఆటోడ్రైవర్. ఇతనికి నాలుగు నెలల క్రితం సనా అనే యువతితో వివాహమైంది. అప్పటి నుంచి భార్యతో పాటు అత్తింటి వారితో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మోసిన్‌కు అతని సోదరుడు మౌలానా ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌గా వచ్చింది. అనంతరం రాత్రి 10.37 గంటలకు జల్‌పల్లి చెరువు వద్ద ఉన్నట్లు మోసిన్ వాట్సాప్ లొకేషన్, వాయిస్ రికార్డింగ్‌ను సోదరుడికి పంపించాడు. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా అతడు కనిపించలేదు. మోసిన్ సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రక్తమోడుతున్న జాతీయ రహదారి

- హైదరాబాద్–బీజాపూర్ హైవేపై ప్రమాదాలు నిత్యకృత్యం
- ఆరు నెలల్లో 20 మంది మృత్యువాత
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు



పూడూరు గేటు వద్ద జరిగిన ప్రమాదం (ఫైల్)



హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ప్రమాదకరమైన మలుపులను పరిశీలిస్తున్న హైవే అధికారులు, పోలీసులు (ఫైల్)

పూడూరు: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి రక్తమోడుతోంది. ఈ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నా.. సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మండల పరిధిలోని హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై గడిచిన ఆరు నెలల్లో 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రెండేళ్ల క్రితం నేషనల్ హైవే అథారిటీ అధికారులు, ఆర్‌అండ్‌బీ, జిల్లా పోలీసు అధికారులు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌గా గుర్తించి వదిలేశారు. ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మన్నెగూడ నుంచి కొడంగల్ వరకు ఉన్న హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల్లో ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదంటూ బాధిత కుటుంబీకులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు.

ట్రాఫిక్ సిబ్బంది ఎక్కడ..?

హైద్రాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ దృష్ట్యా ప్రభుత్వం చన్గోముల్, కొడంగల్‌లలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేసింది. కానీ వారు ఎక్కడ విధులు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి. అంగడిచిట్టంపల్లి గేటు నుంచి సోమన్‌గుర్తి గేటు వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాలు

- సెప్టెంబర్ 1న మండల పరిధిలోని ఉమ్మెంతాల్‌లో లోహెర ఆర్గానిక్ ఫాంలో పనిచేస్తున్న చేతక్ ఆనంద్‌రావు(25) పాలు, కూరగాలు తీసుకుని హైదరాబాద్ వెళ్తుండగా పూడూరు గేటు వద్ద డీసీఎం ఢీకొని మృతి చెందాడు.
- సెప్టెంబర్ 4న బంధువుల దశదిన కర్మకు వెళ్లిన కుటుంబ సభ్యుల్లో లావణ్య(40) మృతి చెందగా.. ఆమె భర్త వెంకటేశ్, తండ్రి రాంచంద్రయ్య క్షతగాత్రులయ్యారు.
- ఈ నెల 17న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో పూడూరు మండలం మేడికొండ గ్రామానికి చెందిన చిలకమర్రి నవీన్‌కుమార్(21), బుడ్డమొళ్ల హర్షకుమార్(15), గొంగుపల్లికి చెందిన మిట్టకంకటి ప్రవీణ్‌కుమార్(20) తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చారు.

ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి



ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్లకుండా బారికేడ్లు పెట్టాలి. మలుపులు ఎక్కువగా ఉన్నందున సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు వేయించాలి. అధికారులు చొరవ తీసుకుని ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి.

– పెంటయ్య, మాజీ సర్పంచ్, తిర్మలాపూర్

మలుపుల వద్ద బొలార్డ్స్



వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం పూర్తి స్థాయిలో ప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తున్నాం. ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్ సేఫ్టీ, హైవే అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో ప్రమాదకర ప్రాంతాలను గుర్తించాం. జీబ్రా క్రాసింగ్ లైన్, రాంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్ ఏర్పాటు చేస్తాం. మలుపుల వద్ద బొలార్డ్స్‌ను ఏర్పాటు చేసేందుకు తీసుకుంటున్నాం.

– మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐ, చన్గోముల్

మారనున్న తాండూరు రూపురేఖలు



మాట్లాడుతున్న డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ తదితరులు

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యం
- మండల అభివృద్ధికి రూ.117కోట్ల నిధులు మంజూరు
- డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్

లింక్‌రోడ్ల నిర్మాణానికి కేటాయించిన నిధులు

లింక్‌రోడ్డు	నిధులు
కోటబాసుపల్లి-మల్కాపూర్	రూ.1.30 కోట్లు
గౌతాపూర్-చెన్‌గేస్‌పూర్	రూ.2 కోట్లు
గౌతాపూర్-గోపన్‌పల్లి	రూ.50 లక్షలు
పాత తాండూరు-నారాయణపూర్	రూ.3.60 కోట్లు
ఓగిపూర్-కర్ణాటక ఛత్రశాల	రూ.1.50 కోట్లు
వీరారెడ్డిపల్లి-బెల్కటూర్	రూ.1.75 కోట్లు
మిట్టబాసుపల్లి-బెల్కటూర్	రూ.1.15 కోట్లు
సిరిగిరిపేట్-సంకిరెడ్డిపల్లి	రూ.1.25 కోట్లు
సిరిగిరిపేట్-అల్లాపూర్	రూ.2.15 కోట్లు
చంద్రవంచ-చిట్టిఘనాపూర్	రూ.1.10 కోట్లు
కరన్‌కోట్-జీవన్గి-బషీరాబాద్	రూ.30 కోట్లు

తాండూరు రూరల్: మరో రెండేళ్లలో తాండూరు మండలం రూపురేఖలు మారుతాయని.. నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితోనే సాధ్యమని డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ.. తాండూరు మండల అభివృద్ధికి ప్రభుత్వం రూ.117 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఇందులో బొంకూరు–బిజ్వార్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.85 కోట్లు, తాండూరు టౌన్ మీదుగా నాలుగు లైన్ల రోడ్ల నిర్మాణానికి రూ.35కోట్లు, సంగెం కలాన్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.20 లక్షలతో పాటుగా లింక్‌రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్నప్ప, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్, గని కార్మిక సంఘం చైర్మన్ పండరి, నాయకులు సాయిలు, శ్రీశైలంగౌడ్, హరీశ్వర్ రెడ్డి, నారాయణరెడ్డి, నర్సింహారెడ్డి, రాంరెడ్డి, శాంతు, వెంకటయ్య, నర్సింలు, మల్లేశం, మెగులాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బలమైన శక్తిగా బీజేపీ



తాండూరు టౌన్: సభ్యత్వ నమోదులో మాధవరెడ్డి, పార్టీ శ్రేణులు

పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

తాండూరు టౌన్: బీజేపీ రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎదుగుతోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని బూత్ నెంబర్ 139, 140లో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందని.. ఇందుకు ఆకర్శితులై పలువురు స్వచ్ఛందంగా సభ్యత్వాలు తీసుకుంటున్నారన్నారు. సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి వివేకానందారెడ్డి, సహ ప్రముఖ్ భద్రేశ్వర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, తాండూరు పట్టణ ప్రధాన కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

50 లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యం

యాలాల: రాష్ట్రంలో 50 లక్షల సభ్యత్వ నమోదు చేయడమే లక్ష్యం బీజేపీ నేతలు పనిచేస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని రాస్నం గ్రామంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తాతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి వివేకానందరెడ్డి, నాయకులు ప్రవీణ్‌కుమార్, రవి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి అర్హతతో డిగ్రీవరకు ఉపకారవేతనం



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు

టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్

దుద్యాల్: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాన్ని సాధించేందుకు శ్రమించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని చిల్‌ముల్ మైలారం పాఠశాలలో టీవీవీ, యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఎంఎంఎస్‌లో ఒక్క సారి అర్హత సాధిస్తే విద్యార్థి డిగ్రీ పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్ వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకుడు రాములు, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశివర్ధన్, తపస్ నాయకురాలు శ్రీ ప్రియ, ఉపాధ్యాయులు శివకుమార్, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగకు దేహశుద్ధి

పరిగి: బైక్ ఎత్తుకెళ్లిన వ్యక్తికి గడిసింగాపూర్ గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. తాండూరు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఈ నెల 18న విజేత హాస్పిటల్‌కు వచ్చాడు. అక్కడ ఆయన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ క్రమంలో బుద్లాపూర్ గ్రామానికి చెందిన ముకుందం పరిగిలో పేయింటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా బైక్ యజమాని బంధువులు గడిసింగాపూర్‌లో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని నిలువరించారు. బైక్ తమ బంధువుదేనని నిర్ధారించుకుని దొంగను స్తంభానికి కట్టేసి చితకబాదారు. విషయం పోలీసులకు సమాచారం అందడంతో ఘటనాస్థలికి చేరుకుని ముకుందంను స్టేషన్‌కు తరలించారు.

ఏఐ, సాంకేతికతతో మెరుగైన ఫలితాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నారాయణరావు

తాండూరు టౌన్: అభ్యసనంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(కృత్రిమమేధ), సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నారాయణరావు అన్నారు. సోమవారం కళాశాలలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సహకారంతో కృత్రిమ మేధ, సాంకేతిక పరిజ్ఞానంలో మహిళా సాధికారత అనే అంశంపై 20 గంటల పాటు విద్యార్థినులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యసన స్థాయిలను మెరుగు పరచడానికి, సాంకేతిక నైపుణ్యతను పెంపొందించడానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ జి.సంజీవులు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో ఆర్డినేటర్ బి.కళావతి, అధ్యాపకులు విశాల, సత్యలక్ష్మి, మమత, శిరీష, కిషన్‌బాబు, సంగమేశ్వర్, లక్ష్మణ్, మహేందర్‌రెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధర్మాగ్రహ దీక్ష

తపస్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంతరావు

తాండూరు టౌన్: పీఆర్సీ, డీఏ, పెండింగ్ బిల్లులను పరిష్కారించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో నేటి నుంచి ధర్మాగ్రహ దీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు తపస్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆనందం తెలిపారు. సోమవారం పట్టణ కార్యాలయంలో దీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దీక్షలో భాగంగా మంగళవారం నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులందరూ నిరసన తెలుపుతారన్నారు. ఈ నెల 28న తహసీల్దార్లకు వినతిపత్రం, నవంబర్ 5న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నామన్నారు. గత ప్రభుత్వ గాయాలు మాన్పించేలా, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ధర్మబద్ధంగా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం మీడియా ఇన్‌చార్జి బస్వరాజ్, నాయకులు నరహరిరెడ్డి, మాణిక్‌రావు, శంకర్, శ్రీశైలం, రవి, వినోద్, వీరేశం, రాజేష్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

కొడంగల్ రూరల్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య(ఎంఎంఎస్) అధ్యక్షురాలు అంజిలమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలు సంఘాలు ఏర్పాటుచేసుకుంటూ ఆర్థికంగా ఎదిగేందుకు కృషిచేయాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందుతూ ఆర్థిక అభివృద్ధి సాధించాలని, పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, జిల్లా అడిషనల్ డీఆర్‌డీ సరోజ, డీపీఎం ఐబీ వీరయ్య, ఏపీఎం వెంకన్న, సీసీలు, గ్రామ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

తాండూరు రూరల్: మహిళా సంఘాల సభ్యులు వ్యాపార వేత్తలుగా ఎదిగి కుటుంబాన్ని వృద్ధిలోకి తీసుకురావాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ సూచించారు. సోమవారం మహిళా సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు రేణుక ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ రుణాలను స్వదినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలకు పాఠశాల చైర్‌పర్సన్‌గా, ఇందిరమ్మ కమిటీల్లోనూ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఆనంద్, డీపీఎం శేఖర్, సీసీలు ప్రభు, సంధ్య, శంకర్, అరవింద్, మాణిక్‌రెడ్డి, అనసూయ, వెంకటయ్య, అకౌంటెంట్ కవిత, కంప్యూటర్ ఆపరేటర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి అధ్యక్షురాలిగా రేణుక

మండల మహిళా సంఘం అధ్యక్షురాలిగా మూడోసారి సైతం కోట్లాపూర్ గ్రామానికి చెందిన రేణుకను గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా శ్యామలమ్మ, కోశాధికారిగా వెంకటమ్మలను ఎన్నుకున్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పెద్దేముల్: వాటర్‌మెన్‌లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ మిషన్ భగీరథ ఆధ్వర్యంలో తాగు నీటి సహాయకులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిషన్ భగీరథతో ప్జలకు స్వచ్ఛమైన తాగు నీరు అందిస్తున్నామన్నారు. ప్రజల అపోహలు తొలగించి మిషన్‌భగీరథ నీటిని సేవించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే అన్నారు. పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులంతా ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కుల్కచర్ల అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత తప్పనిసరి

పెద్దేముల్: నీటి సరఫరాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ నీరు అందాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్ అన్నారు. సోమవారం 2వ రోజు పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ వాటర్ మెన్‌లకు నీటి సరఫరాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అఖిల్ మాట్లాడుతూ.. నీటి చుక్క కూడా వృథా కాకుండా చూడాలన్నారు. శుద్ధజలాలు కాలుష్యం కాకుండా చూడాలన్నారు. నీరు నిలిచినా.. పైప్‌లైన్లు పగిలినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ ఏఈ ప్రతిభ, మాస్టర్ ట్రైనర్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతో పట్టణాభివృద్ధి

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

అనంతగిరి: ప్రజల సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. సోమవారం ఆమె రూ.33లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధిని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, కౌన్సిలర్లు మురళి, దేవి రెడ్యానాయక్, స్వాతి, నాయకులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలరిపయట్టులో కొడంగల్ కుర్రాళ్ల సత్తా

కొడంగల్ రూరల్: ఆత్మ రక్షణతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు కలరిపయట్టు తోడ్పడుతుందని కలరిపయట్టు శిక్షకుడు రమేష్ ఆచార్య అన్నారు. ఈ నెల 19, 20వ తేదీల్లో కేరళలోని పాలక్కాడ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కలరిపయట్టు పోటీల్లో కొడంగల్‌కు చెందిన కుర్రాళ్లు రమేష్, అనిల్, మణికంఠ ఉత్తమ ప్రతిభ చాటుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని రమేష్ ఆచార్య తెలిపారు. రాష్ట్రంలో మొదటిసారిగా కలరిపయట్టులో విజయం సాధించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కేరళ కలరిపయట్టు స్పోర్ట్స్ కౌన్సిలర్ చేతులమీదుగా ముగ్గురు కుర్రాళ్లు బహుమతులు అందుకున్నారని, క్రీడలతో మనసు ఆహ్లాదంగా, ప్రశాంతంగా ఉంటుందని ఆయన తెలిపారు.



బహుమతులు అందుకుంటున్న కొడంగల్ కుర్రాళ్లు